# ధరణిపై అక్కసు



- పటేల్, పట్వారీ వ్యవస్థకు కాంగ్రెస్ బీజం
- అదే జరిగితే మళ్లీ లంచాల రాజ్యమే..
- రైతుల నోట్లో మట్టికొట్టేందుకు స్కెచ్
- భూములు లాక్కోవాలని కుట్ర
- కాంగ్రెస్ నేతల రైతన్న కన్నెర్ర

## రైతుల భూములకు భద్రత ఏర్పడింది..



అధికారం కోసం కాంగ్రెస్ నేతలు తెలివి లేకుండా మాట్లాడుతున్నారు. వారు పదేపదే ధరణిని రద్దు చేసి భూమాత పోర్టల్ పెడతామనడం దళారులను ప్రోత్సహించడమే. ధరణి వచ్చాక రైతుల భూములకు భద్రత ఏర్పడింది. ధరణి లేకపోతే డబ్బులు చెల్లిస్తే అధికారులు రైతులకు తెలియకుండా రెవెన్యూ రికార్డుల్లో భూ బదలాయింపు చేసే అవకాశం ఉంది. ఇలా జరిగితే రైతుల మధ్య నిత్యం ఘర్షణ చోటు చేసుకునే అవకా శం ఉంది. మళ్లీ పట్వారి వ్యవస్థను తీసుకొస్తామని సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్కుడు చెబుతున్నాడు. అతడు తెలివి ఉండి మాట్లాడుతున్నాడో లేక మళ్లీ రెవెన్యూ వ్యవస్థలో దళారుల రాజ్యం తేవడానికి ప్రయత్నిస్తున్నాడో అర్థం కావడం లేదు. భూ స్వామి తన పొలం సాగు చేయడానికి చేత గాక ఇతరులకు పొలాన్ని కౌలుకు వేస్తే రెవెన్యూ రికార్డుల్లో పొందు పర్చు తామం టున్నారు.. అదెట్లా కుదురుతది. అలా చేస్తే కొన్ని రోజుల తర్వాత ఆ పొలం అతని పేర మార డానికి అ వకాశం ఉంటది. ప్రస్తుతం భూస్వామి తన పొలాన్ని ఎన్ని రోజులు కౌలుకు ఇచ్చినా వారి పేర ఎక్కడానికి ఆస్కారం లేదు. ఎందుకంటే అలా ఎక్కించడానికి ప్రయత్నించే సమయంలో రైతుకు సమా చారం అందుతుంది. దీంతో అతడు ఆపడానికి వీలుంటుంది. రెవెన్యూ రికార్డులు ఉంటే యజమానికి తెలి యకుండానే భూ బదలాయింపు జరగడానికి అవకాశం ఉంది. ప్రస్తుతం పటేల్ పట్వారీ వ్యవస్థ అవసరం లేదు. ధరణిలో రైతుల భూములకు పూర్తిస్థాయి భద్రత ఉంది. కాంగ్రెస్ నాయకులు రైతుల మధ్య చిచ్చుపెట్టే ఇలాంటి ఆలోచనలు మానుకోవాలి.

**- నరేందర్‌రెడ్డి, రైతు, పూడురు, గద్వాల మండలం**

## ధరణితో దరిద్రం పోయింది




ధరణి రావడంతో రైతులకు పట్టిన దరిద్రం పోయింది. ఈ యాప్‌తో మాకు ప్రభుత్వంపై పూర్తి విశ్వాసంతో ఉన్నాం. దళారీ వ్యవస్థ కనిపిస్తలేదు. గతంలో కాంగ్రెస్ నాయకులు చెప్పిన వారి పేర భూమి రిజిస్ట్రేషన్ అయ్యేది. ఇప్పుడా పరిస్థితి లేదు. ధరణి తో స్లాట్ బుక్ చేసుకున్న 24 గంటల్లోనే రిజిస్ట్రేషన్ అవుతుంది. గతంలో వారం పాటు తిరిగి అలసిపోయేవాళ్లం. ధరణి రాకతో భూమి విలువ పెగింది. ఎంత ప్రయత్నించినా ప్రభుత్వ భూములు కబ్జాకు గురికావు. ఎవరైనా అక్రమంగా భూమిని ఎక్కించుకుని ఉంటే డిలీట్ చేయించుకోవచ్చు. ధరణితో రైతుల భూమిని మ్యాప్ ద్వారా క్లియర్‌గా చూసుకోవచ్చు. పాత, కొత్త పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇవన్నీ రైతులకు ఉపయోగ పడవా? ధరణిని బంగాళఖాతంలో పడేయాలని రేవంత్‌రెడ్డి అంటడు.. ఆయనకు ఇంతనైనా సిగ్గు ఉండాలి.. రైతులు ఈ తొమ్మిదేళ్లలో ఎంత అభివృద్ధి చెందారో ఆయనకు తెలీదా? ధరణి ఉంటే దొచుకోవడానికి వీలు కాదని బంగాళఖాతంలో పడేస్తవా? రిజిస్ట్రేషన్ కోసం పడిగాపులు కాస్తూ.. మీలాంటి లీడర్లకు లంచాలు ఇస్తుంటే బాగుంటది కదా.? రైతుల బాగోగులు చూసేది కేసీఆర్ ఒక్కడే. అలాంటి నాయకుడికి మళ్లీ అధికారం ఇచ్చి మాకు అండగా పెట్టుకుంటాం.

**- టీచర్ గోవిందు, కేటీదొడ్డి మండలం**

## ధరణితో దర్జాగా భూమి మార్పు



తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ధరణి పోర్టల్‌ను ప్రభుత్వం అం దుబాటులోకి తీసు కొచ్చింది. ఇటీవల మా కున్న భూమిని నా కుమారులు, భార్యకు మార్పిడి చేశాను. మీసేవ లో స్లాట్ బుక్ చేసుకొని బుకింగ్ సమయానికి తాసీల్దార్ కార్యాల యానికి మాకుటుంబ సభ్యులు మొత్తం వెళ్లాం. త్వరగానే రిజిస్ట్రేషన్ పూర్తిచేసిన. రిజిస్ట్రేషన్ చేసిన వెనువెంటనే అక్కడే భూమి ఖాతాల నుంచి తొలగించి నేరుగా పాస్‌బుక్‌లోకి ఎవ్వరికీ వారికి మ్యుటేషన్ అయ్యింది. గతంలో రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేశాక ఆ పత్రాలతో రెవెన్యూ అధికారులను కలిసి ఇచ్చాక అది ఎప్పటికి మారుతుందో తెలియని పరిస్థితి ఉండేది. మ్యుటేషన్ కోసం కార్యాలయాల చుట్టు, అధికారుల చుట్టు తిరిగి చేయించుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ధరణి రాకతో నేరుగా మార్పిడి జరుగుతుంది. ధరణి ద్వారానే భూమి మార్పిడి చేశాను. కేవలం పది, పదిహేను నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తయ్యింది. ఎవరికీ రూపాయి లంచం ఇవ్వకుండా పని జరిగిపోయింది.

**-శ్రీనివాసులు ప్రైవేట్ ఉద్యోగి, వనపర్తి**



## నకిలీ రిజిస్ట్రేషన్లకు అవకాశం లేదు..

కాంగ్రెస్ హయాంలో దళారులు భూమిని తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసుకునేవారు. ఇప్పుడు ధరణితో నకిలీ రిజిస్ట్రేషన్లకు చెక్ పడింది. గతంలో లంచం ఇచ్చినా నెలల కొద్ది తాసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మళ్లీ దగాకోరు కాంగ్రెసోళ్లు అన్నదాతలను అగుడు పట్టించడానికి ధరణి తీసివేస్తామంటున్నరు. కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇస్తే రైతుల భూములు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్తాయి.

**-వెంకటస్వామి, వెంకటోనిపల్లి గ్రామం, గద్వాల మండలం**

## ధరణి చాలా బాగుంది..



గతంలో భూములు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే మధ్య వర్తులను పట్టుకోవాల్సి వచ్చేది. వారికి అంతో ఇంతో ముట్టజెప్పి దళారుల రోజు వారీ ఖర్చు భరించి పని చేయించుకోవాల్సి వచ్చేది. తెలంగాణ ప్రభుత్వం ధరణి తీసుకురావడంతో తిప్పలు తప్పినయ్. నేను మూడేండ్ల కింద రెండెకరాల భూమి కొన్నా. అంతకుముందు నాకు ఎకరం భూమి ఉండె. నా వద్ద పాత పాస్‌బుక్ ఉండటంతో కొత్తగా కొన్న భూమి వివరాలు రిజిస్ట్రేషన్ రోజే నా బుక్కులో అధికారులు రాశారు. ఒక్క రూపాయి ఖర్చు కాలేదు. గంట సమయం కూడ పట్టలేదు. ధరణి వల్ల అన్ని విధాలా కరెక్టుగా ఉన్న భూములు అమ్మడం, కొనడంలో ఎటువంటి ఇబ్బందులు ఉండవు. భూ రిజిస్ట్రేషన్ల కోసం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణి వ్యవస్థ బాగుంది. కొత్త పాస్‌బుక్‌లో కొన్న భూమి వివరాలు నమోదు కావడంతో నాకు రైతుబంధు కూడా అందుతుంది. ఎవరు ఏమన్నా ధరణి చాలా బాగుంది. ఎన్నికలొచ్చినందుకు అవతల పార్టీ వారు గిట్టక ఏవేవో చెబుతారు. అవి మనం నమ్మొద్దు.

**- పురుషోత్తం, నారాయణపురం, జోగులాంబ గద్వాల జిల్లా**

## ధరణి లేకుంటే రైతులతో వడ్లు ఎలా కొంటారు..



ధరణి పోర్టల్ లేకపోతే రైతులు పండించిన ధాన్యాన్ని ఏ విధంగా కొనుగోలు చేస్తారు. ధరణి ఉన్నందు వల్ల రైతుల వివరాలన్ని తాసీల్దార్ కార్యాలయం, వ్యవసాయాధికారులతో ఉండడం వల్ల పండించిన ప్రతి గింజనూ కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ధాన్యాన్ని సంబంధించిన డబ్బులను రైతుల అకౌంట్లలో జమ చేయడంతో పాటు రైతుబంధు, రైతుబీమా కూడా అందిస్తున్నారు. ధరణి లేకుంటే అన్నదాతలకు పెట్టుబడి సాయం రైతు బంధు ఎలా వేస్తారో అర్థం కావడంలేదు. ధరణి తీస్తే మళ్లీ పాతరోజులు వచ్చి పట్వారీ వ్యవస్థ మొదలవుతది. అలాంటి ధరణిని తీసేయ్యడమంటే రైతులను ముంచడమే కదా. ఏనాడు కూడా కాంగ్రెస్ వాళ్లకు రైతులమీద మంచి అభిప్రాయం లేదు. ఇప్పుడు కూడా రైతులకు మేలు చేసే ఆలోచన ఉంటే ధరణి తీసేస్తామని అనరు. వారు రైతు వ్యతిరేకులు.

**-కె.రవీందర్ రైతు, దొడగుంటపల్లి**

## అప్పట్లో వీఆర్‌ఏతో చాలా ఇబ్బందులు పడ్డాం..



తెలంగాణ రాక ముందుకు ఉన్న పట్వారీ వ్యవస్థతో మస్తు ఇబ్బందులు పడ్డాం. అప్పట్లో పహా ణీ కావాలంటే పట్వారీ దగ్గరికి వెళ్తే వారికి చేయి తడపందే వివరాలు ఇచ్చేవాళ్ళు కారు. చాలా మంది భూ రికార్డులు కావాలన్న, మ్యుటేషన్ చేయించాల న్నా ,పట్టా పాసుబుక్ కావాలన్నా తాసీల్దార్ ఆఫీస్ చుట్టూ కూలీ పనులు వదిలిపెట్టి తిరిగేవాళ్లు. పట్వారీ వ్యవస్థను తెలంగాణ ప్రభుత్వం రద్దు చేస్తున్నప్పుడు సామాన్య ప్రజలు వారికి మద్దతు ఇవ్వలేదు. ధరణి రాకముందు పైరవీకారుల చేతుల్లో రైతులు నిలువుగా నష్టపోయారు. పట్వారీ వ్యవస్థతో రైతులందరూ ఎన్నో పాట్లు పడ్డారు. కాంగ్రెసోళ్లు అధికారంలోకి వస్తే ధరణి తీసివేసి కొత్త సాఫ్ట్‌వేరు తెచ్చి కౌలుదారు, పట్టదారు కాలమ్ పెట్టి భూములున్న రైతులను నట్టేట ముంచుతామంటున్నారు. ఇలా చేస్తే భూమి ఉన్న ఏరైతు తన భూమిని పడావు అయినపెట్టుకుంటాడు కానీ కౌలుకు మాత్రం ఇవ్వడు. కేసీఆర్ ధరణితో ఒక్క దగ్గరనే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ వంటి చేసి సాయంత్రం వరకు పాసుబుక్ చేతికి ఇస్తున్నారు. రెవెన్యూ వ్యవస్థ గతంలో కంటే మార్పు వచ్చింది.

**- బాలయ్య రాజపేట, వనపర్తి జిల్లా**